ఎండాకాలపు ఎండ చింతనిప్పుల్ని చెరిగి తన నెత్తిమీద పోస్తోంటే తాను మాత్రం ఆ నిప్పుల స్నానమాడుతూ, మాడుతూ, చింతచెట్టు తన చుట్టూ చల్లటి నీడల్ని అందరికీ పంచుతూంది. చింతచెట్టే కాదు దాదాపు ఏ చెట్టయినా, ఏ చేమయినా తమ దరి జేరినవారికి ఎండలో అయినా, వానలో అయినా ఇంత ఆశ్రయం యిస్తాయి. ఎటొచ్చీ సాటోడి నెత్తిమీద నీడను కూలద్రోసేదీ, కాళ్ల క్రింద నిప్పులు పోసేదీ ఈ మనిషిగాడొక్కడే!

ఆ చింతచెట్టు నీడన నిలబడి సేదతీరుతున్న రాఘవయ్యగారు స్వదేశీ పొందూరు ఖద్దరు చొక్కా జేబులోంచి ఖరీదైన విదేశీ సిగిరెట్టు పెట్టెను బయటికి తీసి, అదే దేశ లైటర్‌తో సిగిరెట్టు వెలిగించారు. రిలాక్సింగ్‌గా పొగ త్రాగుతూ చుట్టుపక్కల చూచి, 'ఇంకా చిలకలూరిపేటేనా?' అని అనుకున్నారు.

గుంటూర్నుంచి కుటుంబ సమేతంగా తిరుపతికి వెళ్లుతూ వుంటే ఆయన ఎంబాసిడర్ కారు మార్గ మధ్యంలో ఆగిపోయింది. డ్రైవర్ టైర్ మారుస్తోంటే

# సమసమాజం

## అరిగే రామారావు

ఆయన ఒక్కగాని ఒక్క కొడుకూ డ్రైవర్‌కు సాయపడుతున్నాడు. ఆయన సతీమణి కారు వెనుక సీట్లో మెత్తటి ముఖమల్ దిండ్ల కానుకొని స్టీరియోలోంచి మంద్రస్వరంలో వినిపిస్తోన్న బూతు అర్థాల తెనుగు సినిమా పాటలను వింటూ సుఖంగా మాగన్నుగా వుంది. గుంటూరు ఏసీ. కాలేజీలో సీనియర్ ఇంటర్ చదువుతున్న ఆయన ఒక్కగానొక్క కూతురు ప్రస్తుతం 'నల్లంచు తెల్లచీర' నవల చదువుతూ వాళ్ళ మమ్మీ ప్రక్కన కూర్చుంది —

రాఘవయ్యగారు గుంటూరు టుబాకో బిజినెస్‌లో బిగ్‌షాట్. బిజినెస్ వ్యవహారాలలో ఆయనెంత బిజీగా వున్నా ఎలాగో తీరిక జేసుకొని ప్రతి సంవత్సరం కుటుంబ సమేతంగా తిరుపతి వెళ్ళి, నిత్య కళ్యాణాల ఆ కళ్యాణ చక్రవర్తికి ఏదో ఒక రోజు కళ్యాణం చేయించి వస్తుంటారు. ఈ రోజు కూడా ఆ పని మీదే కార్లో తిరుపతి వెళ్లుతుంటే మధ్య దారిలో ఈ అవాంతరం!

ఆరిపోయిన సిగిరెట్టును రోడ్డు అవతల పడేటట్టు విలాసంగా విసిరేస్తూ, రోడ్డు కవతలవయిపుకు అనుకోకుండా చూశారు. అక్కడ కనిపించిన దృశ్యాన్ని చూచి ఆయన నిశ్చేష్టుడయిపోయారు. ఏదో షాక్ తిన్నట్టు ఆయన పిచ్చిచూపులు చూశారు. సన్నగా వణుకుతున్న ఆయన గుండె అడుగు పొరల్లో ఏదో కదలిక; మరేవో ఆలోచనలు...

ఆయన మళ్ళీ అటుకేసి చూశారు.

రోడ్డు కావయిపు ఏనాదోళ్ల గుడిశ లున్నాయి. గుడిశల బయట పిల్లలు ఆడుకుంటున్నారు. పెద్దవాళ్ల బుట్టలు అల్లుతున్నారు.

ముసలిదైపోతున్న మర్రిచెట్టు ప్రక్కన శిథిలావస్థలో వున్న ఒక గుడిశ మీద ఆయన దృష్టి నిలిచిపోయింది. ఆ గుడిశ ముందు కూర్చుని ఒక ఆడ మనిషి ఈత ఈనెల బుట్ట అల్లుతోంది.

అల్లిబిల్లిగా అల్లుకుంటున్న ఆలోచనల్లోంచి పాత జ్ఞాపకాలు మెదిలి, మనస్సులో ఏదో గుంజాటన మొదలైంది... అప్రయత్నంగా ఆయన కాళ్లు అటుకేసి లాగాయి.

రోడ్డు దాటి ఆ మర్రిచెట్టు కేసి నడిచారు. ముసలి మర్రి చెట్టు క్రింద చక్కటి పడుచు నీడ చక్కగా పరుచుకొని చల్లగా వుంది. ఆ చల్లటి నీడ కలతబడ్డ మనస్సును సేద తీరుస్తూ ఎంతో ఆహ్లాదంగా వుంది.

మెల్లగా అడుగువేస్తూ ఆయన ముందుకు నడిచారు.

బుట్టల్లడం అపుజేసిన ఆడవాళ్లూ, ఆటలాడడం ఆపుజేసిన పిల్లలూ ఆయన వంక వింతగా చూస్తోన్నారు. ఆయన మాత్రం ఆ పాడుబడ్డ గుడిశ వంకే చూస్తోన్నారు. 'ఇదే గుడిశ!' అని తనలో తాను గొణుక్కుంటున్నారు.

తనవంకే ఆశ్చర్యంగా చూస్తోన్న ఆ ఆడ మనిషిని, "సింగయ్య గుడిశ ఇదేనా?" అని అడిగారు.

ఆమె అవునన్నట్టు తల వూపింది.

అవును, తననుకున్నది కరక్టే!

ఈ గుడిశే ఆ గుడిశ, సింగయ్య గుడిశ... ఎండలకు ఎండుతూ, వానలకు తడుస్తూ, కాలపు కాలి తాకుడులకు అదురుతూ, బెదరుతూ శిథిలాతి శిథిలావస్థలో వున్న గుడిశ. ఈ చిన్న గుడిశే ఒకప్పుడు తన ప్రాణాలను కాపాడింది. ఈ గుడిశ ఆ కాళరాత్రి కన్నతల్లిలాగా తనని తన అక్కున జేర్చుకుని, తన గుండెల్లో దాచుకొని వుండకపోతే తానీనాడు ఇలా వుండేవాడు కాదు! ఆ రాత్రితో తనకు ఈ భూమ్మీద నూకలు చెల్లిపోయి వుండేవి!

"మా సింగయ్య మావను అడుగుతున్నారు — ఆడేం జేశాడు బాబూ?" — ఆ ఆడ మనిషి భయం భయంగా అంది.

సింగయ్యను మావ అంటూంది — అయితే ఈమె ఆ సింగయ్య భార్య అన్నమాట!

ఈమె దీర్ఘ రోగపీడితలాగా సన్నగా, బలహీనంగా వుంది; దరిద్ర దేవతకు పరిచారికలాగా చిరిగిన చీరతో, మురికోడుతున్న వళ్లుతో హీనంగా, అతి దీనంగా వుంది.

మెల్లగా నవ్వుతూ, "భయపడమాకు. సింగయ్య ఏమీ చేయలేదు. అతడు నాకు తెల్సు. ఒక్కసారి అతడ్ని పిలువు!" మృదువుగా అన్నారు.

ఇంతలో సింగయ్య, "ఎవరు బాబూ?" అంటూ గుడిశలోంచి బయటికి వచ్చాడు.

అరవై ఏళ్ల సింగయ్య ఎనభై ఏళ్ళు పైబడ్డ పండు వృద్ధుడు లాగా కనిపిస్తున్నాడు. నడుం వంగిపోయింది. జుట్టు తెల్లబడిపోయింది. చిన్న గోచీ తప్ప వంటి మీద మరే ఆచ్ఛాదన లేదు.

గంజి త్రాగుతూ బయటికి వచ్చినట్లున్నాడు — కుడిచేతిలో పాత సత్తుబొచ్చె, మరో చేతిలో సగం కొరికిన పచ్చి మిరపకాయ.

తనకా రాత్రి ఈ గుడిశలో ఆశ్రయమిచ్చి తన ప్రాణాలను పోలీసుల బారి నుండి కాపాడిన ఆ ఏనాది సింగయ్యే ఇతడు!

ఆనాటి తన ప్రాణదాతను ఈ స్థితిలో చూచేసరికి తన గుండెచెరువయిపోయింది. ఏళ్ళు గడుస్తోన్నా, భారత దేశానికి స్వాతంత్ర్యమొచ్చి ఇన్నేళ్లయినా ఈ సింగయ్య లాంటి వాళ్ల స్థితిలో మార్పేంలేదు. ఇంకా ఆ గోచి పాతలే, ఇంకా ఆ గంజి నీళ్లే, ఆ పచ్చి మిరపకాయ నంజుళ్లే, ఆకలితో మాడే ఆ డొక్కలే, ఇంకా రోడ్ల ప్రక్కల ఈ గుడిశల్లో బతుకులే!

రాఘవయ్యగారు రెండుకో గిల్టీగా ఫీలయ్యారు. ఈనాటి తన ఆస్థి అంతస్తుని ముప్పై అయిదేళ్ల క్రితం తన స్థితితో పోలిస్తే— ఈనాడు తనకు మంగళగిరి రోడ్డులో విదేశాలతో వ్యాపారంచేసే సొంత పొగాకు కంపెనీ, వుండడానికి గుంటూరు రింగ్ రోడ్డులో లక్షలు ఖరీదు చేసే పెద్ద భవంతి; తనూ తన భార్యా బిడ్డలూ ఆడంబరంగా తిరగడానికి రెండు కార్లూ, మూడు జీపులున్నూ; కట్టడానికి మడత నలగని మల్లెపూవు

లాంటి బట్టలూ; తినడానికి నెల్లూరు సన్న బియ్యపు అన్నమూ, చికెన్ ఫ్రైలూ, మటన్ కర్రీలూ, మీగడ పెరుగులతో మృష్టాన్నపు భోజనాలూనూ! రోజూ తను కాల్చే ఖరీదైన విదేశీ సిగిరెట్లకూ, త్రాగే విదేశీ మద్యమూ, కాలక్షేపానికి క్లబ్‌లో ఆడే హై స్టేక్ పేకాటకు అయ్యే రోజువారి సాదరు ఖర్చే వెయ్యి రూపాయిలు దాటుతుంది. ఇవన్నీ గాక ఆటవిడుపుగా ఒక పడుచుపిల్లను పర్మినెంట్‌గా 'కీప్' చేసి, గుంటూరు బ్రాడీపేటలో దానికొక మేడ కూడా కొనిపెట్టాడు.

కాని ఆనాడు — ఆనాడు తనెవరు, తన పరిస్థితేంటీ?... గాఢంగా నిట్టూర్చాడు.

"ఎవరు బాబూ?" కళ్లకు వెయ్యి వారగా పెట్టుకొని మాస్తూ అడిగాడు సింగయ్య.

"నేను, సింగయ్యా! నన్ను గుర్తుపట్టలేదా?" అన్నాడు.

"ముసలోడ్ని అయిపోయా కదా బాబు — మీరెవళ్లో గెపితికి రాడంలేదు బాబుగారూ!" అన్నాడు అమాయకంగా.

"నేనూ — రాఘవయ్యను! ఆ రోజుల్లో నేను కమ్యూనిస్టు పార్టీలో పనిజేస్తుండేవాడ్ని! అందరూ నన్ను కామ్రేడ్ రాఘవయ్య అనే వాళ్లు. తరుచూ మీ గుడిశలకేసి వచ్చి మీటింగులు పెట్టుతుండే వాళ్లం గుర్తులేదా?" అన్నాడు.

"ఒక్క కమ్మునిష్టే ఏంటి బాబు. మా వోట్లు కావాల్సి వచ్చినప్పుడల్లా కాంగిరేసోళ్లా, జన్తోళ్లో, ఇదిగవ ఈ మద్దె ఈ తెలుగుదేశపోళ్లా అందరూ వచ్చే వోళ్లే! ఆళ్లల్లో పత్తేకంగా మీరెవళ్లో నామతికి రాడంలేదు బాబూ!" బుర్రగోక్కుంటూ అన్నాడు.

అలా అంటూ సత్తు గిన్నెలో మిగిలిపోయిన గంజి




నీళ్లు గటుక్కున గొంతులో పోసుకున్నాడు. అలా పోసుకోవడంతో పొలమారింది. అరచేత్తో మాడు మీద కొట్టుకుంటూ, ప్రక్కనున్న 'ముంత ఎత్తి మంచి నీళ్లు త్రాగబోయాడు. ఆ ముంతలో నీళ్లు లేవు.

"నీళ్లే! నీళ్లు తేయే సింగీ!" అని పెళ్లాన్ని పిలిచాడు.

"నీళ్లట్టుకు రాటానికి సుక్కెల్లింది ఇంకా రాలా!" అంది సింగి.

దగ్గుతూ, "నీయిమ్మ, పేణం పోతుందే బద్ది రోళ్లు కాడన్న అడిగే!" అంటున్నాడు.

గుక్కెడు మంచినీళ్ల కోసరం అలమటించి పోతున్న సింగయ్యను చూస్తోంటే రాఘవయ్యగారికి పాత జ్ఞాపకాలు మనస్సులో మెదలసాగాయి...

కరుడు గట్టిన చీకటి; గడ్డకట్టిన నిశబ్దం, సగం సగం అల్లిన ఈతబుట్టలూ, ఈత ఈనెలూ క్రింద భయంతో మునగ దీసుకున్న తనూ, ప్రాణభయంతో పీచు పీచు మంటున్న తన గుండె చేస్తున్న చప్పుళ్లూ... ఆ నిశబ్దాన్ని చీలుస్తూ గుడిశలో గబుక్కున దగ్గు వినిపించింది. ఎడతెరిపి లేకుండా అలా వినిపిస్తోనే వుంది. సింగయ్య ముసలి తండ్రి అలా ఖంగు ఖంగున దగ్గుతూ, ఆయాసపడుతూ, "అరేయ్ సింగయ్యా! కూసిని నీళ్లియ్యరా! బేగియ్యిరా బాబు, పేనం పోయ్యేటట్టుంది—" అని మూల్గుతున్నాడు.

గుడిశ బయట కూర్చొని బీడీ త్రాగుతున్న సింగయ్య



కళాప్రపూర్ణ

శ్రీ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి

వ్యాస పరంపర

'తెలుగు జానపద కళా సరస్వతి'

త్వరలో ప్రారంభం!

వారం వారం వెలువడుతుంది!

తెలుగు వారి జానపద కళా రూపాల గురించి తెలుసుకొనడం 'అమ్మ పుట్టిల్లు' గురించి అడిగి తెలుసుకోవడం లాటిది. చదివి ఆనందించండి!


లోపలికి వచ్చాడు.

తను ప్రక్కకు తిర్గాడు — తన కాలు తగిలి నీళ్ల ముంత క్రిందపడిపోయింది. అందులో వున్న కాసిని నీళ్లా నేలపాలయిపోయాయి "నీళ్లన్నీ క్రింద పోయాయి!" అని తను గొణిగాడు "పోన్లే దొరా!" సింగయ్య మెల్లగా అన్నాడు.

"నీళ్ల ముంత పగిలిపోయిందే అయ్యా!" సింగయ్య అన్నాడు... "ఎవరు పడేశా్రరా? ఎవర్తో గుసగుస లాడుతున్నావా"... "ఎవరున్నారు గుసగుస లాడ్డానికి?"... "మరి నీళ్ల ముంతెట్టా పగిలిందిరా? ఎవరు పడేశారు?"... "ఎవరూ పడెయ్యేలా! అదే పగిలింది"

"గొంతెడుకు పోతూంది కూసిని నీళ్ల తేరా అయ్యా!"...

"ఈ సీకట్లో మూడు కోసుర్లు నడిసెల్లి ఇప్పుడు నీళ్లు తెమ్మంటావా? పడుకో పడుకో! రేపు తాగుదువులే!"... "నాలిక పీక్కు పోతుందిరా!"...

తన కాలు తగిలి నేలపాలయిపోయిన నీళ్లను చేత్తో తాకుతూ, "నీళ్ళు, నీళ్లా!" అని అలమటించి పోతున్న సింగయ్య తండ్రి వంక తను నిస్సహాయంగా, జాలిగా మాస్తుండిపోయాడు...

— ఆనాటి ఆ పాత సంఘటన గుర్తుకు వచ్చి రాఘవయ్యగారు ఖిన్నులైపోయారు.

బోరింగు పంపులూ, బావులూ ఆ పరిసర ప్రాంతాల్లో ఏవయినా కనిపిస్తాయేమోనని తల త్రిప్పి అటూ ఇటూ మాస్తూ, "సింగయ్యా! మీకు దగ్గర్లో మంచి నీళ్ళు దొరకవా?" అని మెల్లగా అన్నాడు.

"లేవు బాబు, ముంతెడు నీళ్ళు కావాలన్నా మూడు కోసుర్లు నడుసుకుంటూ పోవాలి!" అన్నాడు నిర్లిప్తంగా.

ఇన్నేళ్ళు గడిచినా మార్పేం లేదు. ఆనాడెలా వుందో ఈనాడూ అలాగేవుంది! ఎన్నేళ్ళు గడిచినా, ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎన్ని క్రొత్త రాజకీయ పార్టీలూ, రాజకీయ నాయకులు ఉద్భవించినా వీళ్ళు ఇంకా ఇలాగే వున్నారు. —ముంతెడు నీళ్ళ కోసం మూడు క్రోసులు పోవాల్సిన దుస్థితిలోనే వున్నారు!

రాఘవయ్యగారు దీర్ఘంగా నిట్టూర్చి, "సింగయ్యా! మీ అయ్య బాగున్నాడా?" అన్నాడు.

"మా అయ్య ఏనాడో వచ్చిపోయాడు. ఇంతకు మీరెవళ్ళు బాబూ?" ఆశ్చర్యంగా అన్నాడు.

"ఇంకా నీకు గుర్తుకు రాలేదా? అప్పట్లో నేను కమ్యూనిస్టు పార్టీలో పని చేస్తుండేవాణ్ణి. మీలాంటి బీదా బిక్కోళ్ళ బ్రతుకులు బాగుచేయాలని, బీదవాళ్ళూ ధనవంతులూ అనే తేడాలేని సమసమాజాన్ని తీసుకు రావాలనీ మేం విప్లవకారులుగా మారాం. ఆ రోజుల్లో మా పార్టీమీద బ్యాన్ వుండేది. అయినా మేం అండర్ గ్రౌండ్‌కెళ్ళి మా పార్టీ కార్యకలాపాలను రహస్యంగా సాగిస్తుండేవాళ్ళం. ఒక రాత్రి పోలీసులు నా వెంటబడి తరుముతూంటే నేను పరిగెత్తుకుంటూ వచ్చి మీ గుడిసెలో దాక్కున్నా..."

ఆయన మాట కడ్డువచ్చి, "అవును బాబు, ఇప్పుడు గేపకానికి వత్తోంది. ఆ రేతిరి మిమ్మల్ని ఈత ఈనెలూ, బుట్టలూ కప్పి మా గుడిసెలో దాపెట్టాను! అవును బాబు, ఆయాళ పోలీసోళ్లు మీ ఎనకమాల ఎందుకుపడ్డారు బాబు?" ఆనాటి సంఘటన్ని గుర్తుకు తెచ్చుకుంటానికి ప్రయత్నిస్తూ అన్నాడు.

"ఆ రాత్రి పేటలో పుగాకు బేరన్ల వెనుక మా పార్టీ కార్యకర్తలతో రహస్య సమావేశం జరుపుతున్నారు. నా ఆమాకీ తెలిసి నన్ను పట్టుకుంటానికి వచ్చారు. వాళ్ళు నా వెంటబడి తరుముతుంటే నేను పారిపోతున్నాను. ఇంతలో మీ గుడిసె కనిపించి అందులో దూరాను..."

"అవును బాబు అవును! ఇప్పుడు బాగా గేపితి కొత్తోంది! అప్పుడు మా ముసలోడు కూడా వున్నాడు. ఆయాళ ఆళ్ళను బలే బురిడీ కొట్టించా బాబు! ఆళ్ల నిజం సెప్పరా అంటూ లాఠీతో నన్నూ, మా ముసలోడ్ని రెండు దెబ్బలు కూడా వేశారు బాబు!" వీపు తడుముకుంటూ అన్నాడు.

"అయినా నీవు నిజం చెప్పలేదు. నన్ను నీ గుడిసెలో దాపెట్టి నా ప్రాణాలను కాపాడావు!

"ఆ రోజుల్లో మీరు మాలాంటి బీదనాయళ్ళ కోసరం శానా ఇదవుతున్నారని అభిమేనంతో ఆ రేతిరి మిమ్మల్ని దాపెట్టాను! ... అబ్బ, ఎన్నేళ్ళనాటి ముచ్చట బాబు ఇది!... మళ్ళీ శానాళ్ళకు కనిపించారు! ఇప్పుడెట్టున్నారు, ఏం సేత్తున్నారు బాబు!" అన్నాడు ఆప్యాయంగా.

ఈ ప్రశ్నలకు తనేమని సమాధానం చెప్పతాడు? మూడు పువ్వులూ ఆరు కాయలుగా వున్నానని చెప్పతాడా? ధనార్జనలోపడి లక్షలు లక్షలు గడిస్తోన్నానని చెప్పతాడా? సింగయ్యలాంటివాళ్ల ఎందరో ఆకలితో అలమటించిపోతూంటే, కొందరికే అందుబాటులో వున్న రాజభోగాలు అనుభవిస్తూ, విలాసాల మత్తులో మునిగి తేలుతున్నానని చెప్పతాడా?

మాట దాటేస్తూ, "నా సంగతి సరే! మీరెలా వున్నారు సింగయ్యా!" అన్నాడు.

సింగయ్య చిన్నగా నవ్వుతూ, "మీరే సూత్తూన్నారుగా బాబు, అప్పుడెట్టాగున్నామో ఇప్పుడూ అట్టాగే వున్నాం. కాపోతే ఇంకా దరిద్దుర్లం అయ్యాం!" విరక్తిగా అన్నాడు.

సింగయ్య వంక సూటిగా మాళ్లేక సిగ్గుతో రాఘవయ్యగారు తల వంచుకున్నారు.

ఆనాడు తాము స్థాపించాలనుకున్న 'సమసమాజం' ఇదిగో ఇట్లా వుంది! తమ పార్టీలో చీలికలు రావడం— ఆనాటి కార్యకర్తలు తలోక దారి అయిపోవడం— రాజకీయ వాతావరణం స్వార్థపూరితంగా మారిపోవడం— రాజకీయ నాయకుల్లో చిత్తశుద్ధి లోపించడం—

పార్టీల మార్పిడీ, సిద్ధాంతాల గారిడీ— తనలాంటి వాళ్లు కొందరు ఈ సింగయ్యలాంటి మట్టి మనుషులను ఎరువులుగా వాడుకొని నాయకులుగా మొలకెత్తి, రాజకీయాల్లో తలయెత్తి నిలబడి, అన్ని రకాలుగా పలుకుబడిని సంపాదించి, ఆ పలుకుబడిని పెట్టుబడిగా పెట్టుకొని వ్యాపారాలు మొదలుపెట్టి భారీ లాభాలార్జించి, బడా వ్యాపారులుగా, సంపన్నులుగా, చివరకు కేపిటలిస్టులుగా మారిపోవడం— ఈ సింగయ్యలాంటివాళ్లు కడు బీదవాళ్ళుగా, నిత్య దరిద్రులుగా మారిపోవడం... ఇదంతా మనస్సులో మెదిలి, గుండెని కెలికింది.

ఆయన గాఢంగా నిట్టూర్చాడు. ఏదో ద్రోహం చేసిన వాడిలాగా తనలో తాను పశ్చాత్తాపపడుతూ, 'సమసమాజం' అనే పదాన్ని ఉచ్చరించడానికి కూడా అర్హత కోల్పోయినందుకు సిగ్గిల్లుతూ సింగయ్య ముందు ఒక దోషిలాగా తలవంచుకొని నిలబడ్డాడు.

ఇంతలో ఒక యువతి నీళ్ళ కడవను, దానిపైన మరో రెండు ముంతలను నెత్తిమీద పెట్టుకొని అక్కడికి వచ్చిందది. ఎండలో చాలా దూరం నడిచివచ్చినట్లుంది. ఒళ్ళంతా చెమటల్లు కారుతున్నాయి.

ఆ పిల్ల అందించిన ముంతలోని నీళ్ళను ఆత్రంగా త్రాగి దప్పిక తీర్చుకున్న సింగయ్య, "సుక్క బాబు, నా కూతురు!" అన్నాడు.

రాఘవయ్యగారు సుక్క వంక చూశారు. చింపిరి జుట్టుతో, మురికి బట్టలతో వుంది. పేళ్ళెండ ఆమె మీద పడి దాష్టీకం చేస్తోంది. ఆ దాష్టీకాన్ని అడ్డుకోవడానికి ఆమె ఒంటిమీద చిరుగులుపడ్డ ఇంత పాత నైలాను ముక్క తప్ప మరేం లేదు. ఆ పాత గుడ్డ ముక్కనే ఓణీగా వేసుకొని వయస్సు పొంగులను దాచుకోడానికి వృథాప్రయత్నం చేస్తోంది. అదే తన కూతురు వయస్సు పొంగుల్ని ప్రదర్శించే ఫ్యాషన్ బుక్ దుస్తుల్ని ధరిస్తుంటుంది.

ఇంతలో తమ కారు హారన్ మోత దీర్ఘంగా వినిపించసాగింది. రిపేర్ పూర్తయిందన్నమాట! తన కోసం వాళ్ళు వెయిట్ చేస్తున్నారు.

జేబులోంచి హడావుడిగా రెండు వంద రూపాయిల కాగితాలను బయటికి తీసి సింగయ్యకివ్వబోయారు.

సింగయ్య నిరాకరించాడు.

"తీస్కో సింగయ్యా! ఆనాడు నీవు నా ప్రాణాలను పోలీసుల బారి నుంచి కాపాడి నాకెంతో సాయం చేశావు తీస్కో!" అని బలవంతం చేశారు.

"ఆ యాళ మిమ్మల్ని దాపెట్టి కాపాడింది ఈ డబ్బుల కోసరం కాదు బాబుగారూ! ఆ రోజుల్లో మీరు మావాంటి బీదోళ్ళ కోసరం కట్టపడుతున్నారనే కానీ, మీరేదో నాకు ముట్టచెప్పతారని కాదు బాబుగారు! డబ్బుల కోసరమే అయితే ఆ యాళ మిమ్మల్ని ఆ పోలీసోళ్ళకు పట్టిత్తే అల్లింకా ఎక్కువే ఇచ్చేవాళ్ళు!" అన్నాడు.

రెండొందలు చాలనంటున్నాడనుకొని జేబులోంచి మరో వంద నోటు బయటికి తీసి ఇవ్వబోయాడు.

సింగయ్య ససేమిరా తీసుకోనన్నాడు.

"ఈ మూడొందల్తో మా బతుకులు బాగుపడిపోవు! వద్దు బాబు, ఈ డబ్బు మీకాడే వుంచుకోండి!" అన్నాడు.

రాఘవయ్యగారు సింగయ్య ముందు మళ్ళీ తల వంచు కోవల్సివచ్చింది.

"మరి నీ మేలు ఎలా తీర్చుకోమంటావు సింగయ్యా?" అన్నారు.

"ఇతని మేలు తీర్చుకోవడానికి ముప్పై సంవత్సరాల తర్వాత నీకు కుదిరిందా రాఘవయ్యా!". అని తన మనస్సు ఒకవైపు నుంచి నిలదీసి అడుగుతూంది.

సింగయ్య చిన్నగా నవ్వి, "ఏం సేత్తే మాలాంటి బీదనాయాళ్ళ బతుకులు సేసితంగా బాగుపడుతాయో బాగా ఆలోచించి అది సేయండి బాబు!" అన్నాడు.

ఆ గోసిపాత ముసిలోడులో మరో గొప్ప మనిషి కనిపించాడు.

హారన్ మోత మళ్ళీ మళ్ళీ వినిపించసాగింది.

—కార్లో వెళ్ళుతున్నా, "ఏం సేత్తే మాలాంటి బీదనాయాళ్ళ బతుకులు సేసితంగా బాగుపడుతాయో బాగా ఆలోచించి అది సేయండి ... అది సేయండి ... అది సేయండి! ..." సింగయ్య మాటలు మాటి మాటికి వినిపించసాగాయి!

ఒంగోలు దాటుతుండగా రాఘవయ్యగారు హఠాత్తుగా కారుని వెనక్కి మళ్ళించవేశాడు. "అయ్యో ఇదేంటి?" అని భార్యా పిల్లలు మొత్తుకుంటున్నా వినకుండా, "మనం తిరపతి వెళ్ళడం లేదు. గుంటూరుకు తిరిగి వెళ్ళిపోతున్నాం. నోరు మూసుకొని కూర్చోండి!" అంటూ కారుని గుంటూరువైపు పట్టించారు.

**  **  **

నెల తిరక్కుండా సింగయ్య గుడిశలు దగ్గర రెండు బోరింగు పంపులు పడ్డాయి. పది పక్కా ఇళ్ళకు గోడలు చకచకా లేస్తున్నాయి. రాఘవయ్యగారి పొగాకు కంపెనీలో పన్జేస్తున్న ఒక కుర్రాడితో సింగయ్య కూతురు సుక్కకు పెళ్ళి అయిపోయింది.

ఆ పెళ్ళి పందిట్లో —

" ... సింగయ్య అన్నట్లు బాగా ఆలోచించాను. నాకు మంచిదనిపించిందీ, నాకు చేతనయిందీ ఇది! అదే చేశాను ... ఆ తిరుపతి ఎంకన్నకు కళ్యాణాలకేం కొదువ? ప్రతి రోజూ పోటీలుపడి మరీ అందరూ ఆ స్వామికి కళ్యాణాలు చేయిస్తుంటారు! మరి సింగయ్య కూతురు సుక్కలాంటివాళ్ళ కెవరు చేయిస్తారు? ... అందుకే నేను ఏటా చేయించే వెంకటేశ్వరస్వామి కళ్యాణాలూ, సీతారామువారి కళ్యాణాలకు బదులు ఇలాంటి వాళ్ళకు కళ్యాణాలు చేయించాలని, నలుగురికీ ఉపయోగపడే ఇలాంటి మంచి పనులు చేయాలని నిర్ణయించుకున్నాను ..." అని రాఘవయ్యగారు అన్నారు.

గీత్‌మాల క్యాసెట్ గెలుపొందిన
కాలమ్‌ దాటని కథ

## వేళ తప్పని అతిథి

ఆఫీసు పని మీద వారంరోజులు క్యాంప్ వెళ్ళి వచ్చాను.

"వచ్చేశారా... వెళ్ళి స్నానం చేసి బట్టలు మార్చుకోండి... అమ్మాయ్ సుగుణా నాన్నగారికి కాఫీ యివ్వమ్మా" అంటూ హడావుడిగా తన పనిలో పడిపోయింది శ్రీమతి.

"రాజీ! యింకా ఆ చపాతీలు చెయ్యడమే పూర్తి కాలేదా? ఎప్పడు పూర్తవుతాయ్. ఆరున్నర అయిపోయింది... త్వరగా కానీ."



"ఒరే నానీ మన్వెళ్ళి అరటిపళ్ళు తెచ్చెయ్యకూడదూ... సరిగ్గా ఆ అయిదు నిముషాలు తక్కువ ఏడుకు వెళ్తావేంరా..."

"నిమలా నువ్వేం చేస్తున్నావే... ఇప్పుడా పాత పుస్తకాలన్నీ వెతుకులాడడం మొదలెట్టావేమిటి? ఏడవుతోంది, వేగం సర్దేసి రా..."

"ఏమండీ... అబ్బా... యింకా ఆ కాఫీయే తాగుతున్నారా? వేగం స్నానం చేయండి! ఏడయిపోతుంది!"

ఊర్నించి వచ్చినా నన్నంతగా పట్టించుకోకుండా ఏడయిపోతోంది, ఏడయిపోతోందని నా శ్రీమతి ఎందుకు హడావుడి చేస్తుందో అర్థం కావడం లేదు. 'బహుశా ఏడు గంటలకు ఎవరయినా గెస్టు వస్తున్నారేమో!' అనుకుంటూ స్నానానికి వెళ్ళాను.

ఏడు గంటలు కొట్టేందుకు సరిగ్గా ఐదు నిమిషాలు టైముంది. శ్రీమతి హడావుడి, అదిలింపులు ఇంకా ఎక్కువయ్యాయి. ఇక ఉత్సుకత ఆపుకోవడం నా తరం కాలేదు. పెద్దమ్మాయి సుగుణను పిల్చి అడిగాను. "ఏమిటమ్మా..., హడావుడి ఎవరైనా వస్తున్నారా ఏడు గంటలకు"

సుగుణ బదులు చెప్పలేదు గాని గుక్క తిప్పకోకుండా నవ్వుతోంది.

ఏడు గంటలయింది. కరెంట్ పోయింది- పవర్ కట్!!

- తొత్తడి గణపతిరావు, విశాఖపట్నం.